క్లుప్తంగా

మున్సిపల్ లీజు ప్లాట్లను క్రమబద్ధీకరించండి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంథని: మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ లీజు స్థలాలను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్ లీజు దారులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. ఎన్నో ఏళ్లుగా పంచాయతీ మొదలు మున్సిపల్ స్థలాలను లీజుకు తీసుకుని నివాసం ముంటున్నారని తెలిపారు. ప్లాట్ల క్రమబద్ధీకరణ జరుగుతుందని, చాలా కాలంగా ఎదురుచూస్తున్నారన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ కుమార్ తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ వీకే.రవితో పాటు లీజుదారులు ఉన్నారు.

కుంట ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సుల్తానాబాద్ : పట్టణంలోని సుగ్లాంపల్లి - శ్రీరాములపల్లె సర్వేనెంబర్ 556 లో గోపాలపూర్ కుంట ఆక్రమిస్తున్నారని, విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కల్వల శ్రీనివాస్ కార్యదర్శి గరిగే శ్రీనివాస్ కోరారు. సోమవారం తహసీల్దార్ యాకన్న ను కలసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న చేప పిల్లలను కుంటలో పోసి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. చొప్పరి మధురయ్య కుంటను చదును చేసి, నీరు లేకుండా చేస్తున్నారని ఆయనపై చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంపత్, తిరుపతి, రాజు, అంజయ్య, రాము, సతీశ్, సారయ్య, చొప్పరి నర్సయ్య, లక్ష్మీరాజ్యం, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలతో గుట్టలపై పనులు చేయించొద్దు


వినతిపత్రం అందజేస్తున్న నిమ్మరాజుల రవి

రామగుండం: గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు తమ గ్రామ శివారులోనే ఉపాధి పనులు కల్పించాలని లింగాపూర్ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి కోరారు. సోమవారం అంతర్గాం ఎంపీడీవో భూక్య యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలకు సుదూర ప్రాంతాల్లోని గుట్టలపై తవ్వకాల పనులు అప్పగించడం వల్ల కాలినడకన వెళ్లేందుకు, తిరిగి వచ్చే క్రమంలో బండరాళ్లతో గాయాలు కావడం, పనికి వెళ్లేందుకు వ్యయ ప్రయాసాలకోర్చి వెళ్లాల్సి వస్తుందని, తవ్వకపు పనులు సైతం ఇబ్బందిగా ఉండడంతో కూలీ గిట్టుబాటు కావడం లేదన్నారు. ఎండాకాలం సమీపిస్తుండడంతో చెరువు పూడికతీత పనులు, కాలువల తవ్వకపు పనులు అప్పగించాలని కోరారు.

ఆర్మీ ఉద్యోగానికి యువకుడి ఎంపిక

పాలకుర్తి: మండలంలోని ఉండేడ గ్రామానికి చెందిన యువకుడు ఆవుల శ్రీధర్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆవుల లచ్చయ్య-రాజేశ్వరి కుమారుడు శ్రీధర్ చెగ్యాంలో పదో తరగతి పూర్తి చేశాడు, ధర్మారంలోని సాధన కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన శ్రీధర్ ఇటీవల సూర్యాపేటలో జరిగిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఈవెంట్స్‌లో పాల్గొని విజయం సాధించాడు. అనంతరం పరీక్షలో సైతం ఉత్తీర్ణత సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శ్రీధర్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆయన నేత్రాలు సజీవం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ హనుమాన్ నగర్‌లో దుబ్బ భరత్ కుమార్(25) అనే యువకుడు కొంతకాలం నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో ఐ టెక్నీషియన్ నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.

‘ఉపాధి’ పనుల ప్రణాళిక ఖరారు

- 1.8 లక్షల పనిదినాలు
- 2.77 కోట్ల లేబర్ బడ్జెట్
- మెటీరియల్ కంపోనెట్ కింద 1.41 కోట్లు
- వచ్చే ఏడాది కోసం 172 పనుల గుర్తింపు


గ్రామసభలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులు, కూలీలు

ఎలిగేడు: కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని కూలీల వలసలను నిరోధించేందుకు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి వచ్చే 2023–24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. ఆయా గ్రామాల్లో గతేడాది అక్టోబర్ 2 నుంచి నవంబర్ నెల వరకు గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించారు. కూలీల నుంచి వచ్చిన డిమాండ్ ఆధారంగా పనుల గుర్తింపు ప్రక్రియను పూర్తిచేశారు.

రూ.4.18 కోట్ల బడ్జెట్ ప్రతిపాదన..

మండలంలో ఉపాధి హామీ కూలీలకు 1.8 లక్షల పనిదినాలను ఖరారు చేశారు. ప్రస్తుతం మండలంలో 2700 మంది కూలీలు ఉన్నారు. వీరిందరికీ 100 రోజులు పనికల్పించాలనే లక్ష్యంతో ప్రణాళిక నిర్ణయించారు. అక్టోబర్ 2 నుంచి నవంబర్ నెల వరకు నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన 172 పనులను పూర్తి చేసేందుకు రూ.4.18 కోట్ల బడ్జెట్ అవసరమవుతుందని అంచనా వేశారు. దీనిలో లేబర్ బడ్జెట్ రూ.2. 77 కోట్లు ఖర్చు చేస్తేనే మెటీరియల్ కాంపోనెట్ కింద రూ.1.41 కోట్ల నిధులు వస్తాయని అంచనా వేసి నిర్ణయించారు. కేంద్రానికి ఆమోదం కోసం బడ్జెట్ ప్రతిపాదనను అధికారులు పంపించారు.

వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యత

గతంలో మట్టిపనులను చేపట్టేందుకు ప్రాదాన్యత ఇవ్వడంతో చెరువుల్లో పూడికతీయడం, కందకాలు తవ్వడం తదతర పనులతో గ్రామాలకు ఏలాంటి ప్రయోజనం కలుగలేదు. మెటీరియల్ కంపోనెట్ కింద చేపట్టే పనులు శాశ్వత ప్రయోజనం కలగాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది వ్యవసాయ అనుబంధ రంగాలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రాధాన్యతనిచ్చారు. ప్రధానంగా ఎస్సారెస్పీ కాలువల్లో పూడిక, కాలువల తవ్వకం, పొలాలకు వెళ్లేందుకు కొత్తగా మట్టిరోడ్ల నిర్మాణం, సరిహద్దు కందకాల తవ్వకం, భూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిచ్చారు. పలు గ్రామాల్లో కూలీలు, రైతులు కూడా పనులను చేపట్టాలని కోరారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం,గుంతల తవ్వకం, కంచెల నిర్మాణం,మొక్కలకు నీళ్ల పోయడం తదితర పనులను నిరంతరం కొనసాగిస్తారు.

మండలంలో ఉపాధిహామీ పథకం వివరాలు	
ఉపాధి జాబ్ కార్డులు:	4,547
పనిచేసే కూలీలు:	2,700
గ్రామపంచాయతీలు:	17
పూర్తయిన గ్రామసభలు:	17

ప్రతిపాదనలు పంపించాం



వచ్చే ఏడాదికి సంబంధించిన ఉపాధిహామీ పనిదినాల ప్రతిపాదనను కేంద్రానికి నివేదించాం. కేటాయించిన బడ్జెట్ ప్రకారం పనులు జరుగుతాయి. శాశ్వత ప్రయోజనాలు కలిగే పనులను గ్రామసభల్లో గుర్తించి ప్రతిపాదించాం. కూలీలు చేస్తున్న పనిదినాల ఆధారంగా కొత్తగా 1.8లక్షల పనిదినాలకు ప్రతిపాదనలు రూపొందించాం.
– సదానందం, ఏపీవో ఉపాధి హామీ, ఎలిగేడు

ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి


చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్ : ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా, మహిళలకు స్వశక్తి రుణాల పంపిణీ, గర్భిణులకు నెల మొదలుకుని డెలివరీ అయ్యే వరకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా సేవలు అందుతున్నాయని వివరించారు. చెక్కులు ఎవరు పంపించారని లబ్ధిదారులను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని వివరించారు. పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు అనంత రెడ్డి, ఎంపీపీ బాలాజీ రావు,మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, కేడీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మెన్ బుర్ర మౌనిక,వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత,మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు,పట్టణాధ్యక్షుడు పారుపెల్లి గుణపతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు వీరగోని సుజాత గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు పకీర్ యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గంలో పయనించాలి

ప్రతి ఒక్కరూ గాంధీజీ చూపిన మార్గంలో పయనిస్తే అభివృద్ధి సొంతమవుతుందని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్‌లో గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మున్సిపల్ యూత్ పట్టణ అధ్యక్షుడిగా ఎండీ. వహీద్

బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడిగా ఎండీ వాహిద్‌ను నియమిస్తూ పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం నియామక పత్రాన్ని వాహిద్‌కు అందజేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై ప్రజల్లో వ్యతిరేకత


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్‌రెడ్డి

కమాన్‌పూర్/పాలకుర్తి: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర వ్యతిరేకత వస్తుందని బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. పాలకుర్తి మండలంలోని కన్నాల, రాణాపూర్, జీడీ నగర్‌లకు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు సునీల్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పార్టీ గెలుస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కన్నాల లారీ అసోసియేషన్ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్, తీన్మార్ మల్లన్న టీం జిల్లా కన్వీనర్ పీసర్ల లక్ష్మణ్‌రావు, సామాజిక కార్యకర్త మడిపల్లి సంజీవ్, వార్డు సభ్యులు బుర్ర సదిగౌడ్, గండికోట రజిత– బొబ్బిలిరాజ్, గౌరీమోహన్, మల్క సురేందర్, మోటం రవి, చిందం శ్రీనివాస్ తదితరులు పార్టీలో చేరారు.కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగెపెల్లి అజయ్. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీ కుటుంబానికి చేయూత


బాండ్ అందిస్తున్న సీఆర్పీలు, డీఈవో

జ్యోతినగర్: సీఆర్‌పీ మెండే ప్రభాకర్ కుటుంబానికి తోటీ సీఆర్పీలు సోమవారం ఆర్థికసాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. రామగుండం మండల విద్యాశాఖలో పని చేస్తున్న సీఆర్పీ మెండే ప్రభాకర్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభాకర్ కుటుంబానికి జిల్లాలోని సీఆర్పీలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మండల ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు రూ. లక్ష విరాళం సేకరించారు. ప్రభాకర్ కుమారుడి పేరుపై ఎల్‌ఐసీలో లక్ష రూపాయలను డిపాజిట్ చేసి పత్రాలను జిల్లా విద్యాధికారి మాధవి చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు విజయకుమార్, జింక మల్లేశం, పీజీ హెచ్ఎంలు, సీఆర్పీలు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు కుంబాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి మల్లన్న, ఎస్ ఎస్ ఏ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, మండల నాయకులు రామ్ కుమార్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డెరలకు రిజర్వేషన్లు కల్పించాలి

రామగుండం: ఒడ్డెరకు చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, ఒడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని సోమవారం జిల్లా కలెక్టర్ సంగీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఒడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలమల్లు శివరాత్రి మాట్లాడుతూ ఒడ్డెరలు విద్య, వైద్యం, వ్యాపార, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఒడ్డెరలను కేవలం ఓటు బ్యాంకుగానే రాజకీయ నాయకులు వాడుకుంటున్నారని, జనాభా ప్రాతిపదికన తమకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఒడ్డెర ప్రతినిధులు ఆలకుంట రాజేశం, వేముల సతీశ్, గణేశ్, తిరుపతి, చరణ్, వెంకటేశ్, తరుణ్, సంతోష్, శ్రీనివాస్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ భూముల కబ్జాపై కలెక్టర్‌కు నివేదిక

రామగిరి: మండలంలోని ఎస్సారెస్పీ డీ–83 కాలువ అనుబంధ 3 ఎల్, 4ఎల్ ఉపకాలువల భూముల కబ్జాదారుల వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణకు అందజేసినట్లు సంబంధిత ఈఈ బలరామయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కండె పోశం ఎస్సారెస్పీ 3–ఎల్, 4–ఎల్ కాలువల భూములు కబ్జా అవుతున్నాయని, రాతపూర్వకంగా చేసిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టగా రెండు ఉప కాలువకు చెందిన సుమారు 157 ఫీట్ల భూమి 20 మంది అక్రమంగా ఆక్రమించుకున్నారని గుర్తించినట్లు నివేదికలో పొందుపర్చారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆక్రమణ దారులపై తదపరి చర్యలు తీసుకోనున్నారు.

క్రషర్లపై పొల్యూషన్ కంట్రోల్ అధికారికి ఫిర్యాదు

రామగిరి: మండలంలోని బేగంపేట శివారులో క్రషర్లతో వాతావరణం కలుషితం కావడంతో పాటు పంటపొలాల్లో బండరాళ్లు పడుతున్నాయని రైతులు బుర్ర కుమార్, గిరవేన మల్లయ్య యాదవ్ గోదావరిఖనిలోని పొల్యూషన్ కంట్రోల్ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్రషర్ యజమానులు చేస్తున్న బ్లాస్టింగ్‌లతో పెద్ద బండరాళ్లు వచ్చి పంటపొలంలో పడుతున్నాయని దీంతో ప్రతి ఏడాది పంట నష్టపోతున్నా ఏలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదని దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి క్రషర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.

చెక్కు అందజేత

ఓదెల: మండలంలోని గోపరపల్లె గ్రామానికి చెందిన ఇరుగురాల మల్లయ్యకు మంజూరైన రూ. 2.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె ఓదెలు, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు నారాయణరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలోజు రమేశ్, ఉపసర్పంచ్ తీర్థాల కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి యాజమాన్యం అధికారికంగా నిర్వహించే కార్యక్రమాల్లో గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం నాయకులు అన్నారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సెంట్రల్ కమిటీ సభ్యులు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 33 ప్రకారం 6 శాతం నుంచి 10 శాతం రిజర్వేషన్ సింగరేణిలో జారి అయిన వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి గిరిజన ఉద్యోగులు సంక్షేమ సంఘం సెంట్రల్ కమిటీ నాయకులు చీఫ్ లేజర్ ఆఫీసర్ కృష్ణయ్య, శంకర్ నాయక్, అధ్యక్షుడు భాస్కర్ రావు, పంతులు, తీర్మాల రావు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముత్తారం: మండలంలోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్టు ఎస్సై బేతి రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారుపల్లి, ముత్తారం గ్రామాలకు చెందిన రెండు ట్రాక్టర్లు రాత్రివేళ అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్లకు రూ. 5 వేల చొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ వరందన్ తెలిపారు.

ప్రారంభమైన షెడ్డు పనులు


పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్

సాక్షి స్పందన

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో యోగా షెడ్డు పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఈ నెల 21న ‘షెడ్డు ఇలా యోగా చేసేదేలా’ అనే కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఏడాదిగా షెడ్డు మధ్యలోనే వదిలేయడంతో గ్రామ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సాక్షి దృష్టికి తీసుకువచ్చారు. యోగా షెడ్డుపై కథనం ప్రచురితం కావడంతో అధికారులు కాంట్రాక్టర్‌తో పనులు మొదలు పెట్టించారు. ఎంపీటీసీతో పాటు సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


కమాన్‌పూర్‌లో కాంగ్రెస్ నాయకులు నివాళి


పెద్దపల్లిలో..

జాతిపితకు ఘన నివాళి

మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళి అర్పించారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, ముత్తారం,యైటింక్లయిన్ కాలనీ, కమాన్‌పూర్, ధర్మారం మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో గాంధీజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాంధీజీ ఆశయసాధనకు కృషి చేయాలని పలువురు కోరారు. కాంగ్రెస్ నాయకులు, వైశ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులు అర్పించారు.


యైటింక్లయిన్ కాలనీలో నాయకుల నివాళి

– సాక్షి, నెట్‌వర్క్

కుష్ఠును ప్రాథమిక దశలోనే నిర్మూలించాలి


మాట్లాడుతున్న డాక్టర్ మధుకర్ రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే నిర్మూలించాలని గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మధుకర్‌రెడ్డి అన్నారు. గర్రెపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ వ్యాధిగ్రాస్తులకు ఉచితంగానే మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి దేవీసింగ్, హెచ్ఎం మాధవిలత, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూలపల్లి: కుష్ఠువ్యాధి గుర్తింపు, నిర్మూలన పై ప్రజలు అవగాహన పెంచుకోవాలని మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ అరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కలీమొద్దీన్,హెచ్ఎస్ వసంత, ఎల్‌టీ కిరణ్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

ముత్తారం: మండల కేంద్రంలోని ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అమరేందర్ కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వతేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలోని ప్రజలకు కుష్ఠువ్యాధి నిర్మూలనపై ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లలిత, ఫార్మాసిస్టు జయప్రద, సిబ్బంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాలు సందర్శన


వృద్ధురాలికి కంటి పరీక్ష చేస్తున్న సబీహా

ధర్మారం: మండలంలో కంటి వెలుగు శిబిరాలను జిల్లా క్వాలిటీ కంట్రోల్ అనాల్‌సిస్ట్ డాక్టర్ సబిహా సోమవారం సందర్శించారు. మండలంలోని కొత్తూరు, మేడారం, దొంగతుర్తి గ్రామాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను ఆమె సందర్శించి వైద్యులకు సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సబిహా మాట్లాడుతూ శిబిరాలకు వస్తున్న ప్రజలకు నాణ్యమైన పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనుదీప్, వైద్యులు గౌతం, సుస్మిత, మాణిక్య జ్యోతి, హెచ్ఈవో కల్లెం రాజిరెడ్డిఏఎన్ఎం , ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

జూలపల్లి: కంటి వెలుగు కేంద్రాలలో ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని ప్రోగ్రాం వైద్యాధికారి రత్నాకర్ సూచించారు. మండల కేంద్రంతో పాటు కుమ్మరికుంటలో కంటి వెలుగులో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, వైద్యులు లహరిక, ఏఎన్ఎంలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దివ్యాంగులు మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలి

జూలపల్లి: మండలంలోని దివ్యాంగులు నేటి నుంచి సదరం ధ్రువీకరణ కోసం మీసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని డీఆర్‌డీవో పీడీ శ్రీధర్ సూచించారు. తాత్కాలిక సదరం ఉన్నవారు, కొత్తగా శారీరక వైకల్యం ఉన్నవారు ఫిబ్రవరి 2,16 తేదీల్లో నిర్వహించే సదరం క్యాంపు స్లాట్‌ల కోసం, దృష్టి లోపం ఉన్నవారు 9 నాటి స్లాట్‌కు, మానసిక వైకల్యం ఉన్నవారు15న, వినికిడి లోపం ఉన్నవారు 23న నిర్వహించే సదరం క్యాంపు కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని పీడీ పేర్కొన్నారు.

నేడు బుర్హాన్‌మియాపేటలో సివిల్‌రైట్స్‌డే

ఎలిగేడు: మండలంలోని బుర్హాన్‌మియాపేటలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజమ్మ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

ఓదెల: మండలంలోని పొత్కపల్లి ఎస్సీకాలనీలో మంగళవారం ఉదయం 11గంటలకు సివిల్ రైట్స్‌డే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కత్రోజు రమేశ్ తెలిపారు. ప్రజాప్రతినిదులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు.

కమాన్‌పూర్ మండల సర్వసభ్య సమావేశం..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

లారీ అసోషియేషన్ అధ్యక్షుడిగా యూనిస్‌ఖాన్

పాలకుర్తి: పాలకుర్తి మండలం ఉమ్మడి కన్నాల ఏరియా లారీ అసోషియేషన్ అధ్యక్షుడిగా జీడీనగర్‌కు చెందిన యూనిస్‌ఖాన్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీఆర్ఎస్ అనుబంధంగా పనిచేస్తున్న ఈ యూనియన్ అధ్యక్షుడిగా ఇప్పటివరకు కొనసాగిన కంకటి శ్రీనివాస్‌గౌడ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈసందర్భంగా అసోషియేషన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా శ్రీనివాస్ గౌడ్‌ను నియమిస్తూ గౌరవ అధ్యక్షుడు ఫీట్ల గోపాల్ నియామకపత్రం అందజేశారు.

ఫ్రెండ్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పోరెడ్డి గోపాల్‌రెడ్డి

మంథని: మంథని ఫ్రెండ్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పోరెడ్డి గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా సువర్ణ గణపతి. ప్రధాన కార్యదర్శిగా మిర్యాల ప్రసాద్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా మల్క గోపాల్‌రావు, బీముని వెంకటస్వామి, ట్రెజరర్‌గా బెల్లంకొండ రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆకుల రాజబాబు, పుట్ట ముకేష్, పెండ్లి ప్రభాకర్‌రెడ్డి, కట్టకోల్ల సదానందం, గుండా పాపారావును ఎన్నుకున్నారు.

రేపటినుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని హరిహర క్షేత్రంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు యెరబాటి రాజేశ్వర్ రావు, నిర్వహణ కమిటీ సభ్యులు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 1 బుధవారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ, యోగిని, ప్రత్యేక పూజలు, గురువారం ప్రత్యేక పూజలు, 3న చండీ హోమం, సాయంత్రం పూర్ణాహుతి, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.